సాక్షి
అనకాపల్లి
గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



రక్తదాన శిబిరం
విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు.



కొవ్వొత్తుల ప్రదర్శన
మహారాణిపేట: ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా బుధవారం ఏయూ విద్యా విభాగంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు.



ఆకస్మిక తనిఖీలు
సీతమ్మధార: ఏయూ విద్యార్థుల హాస్టళ్లలో అధికారులు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

న్యూస్‌రీల్

మహిళా భద్రతకు ఉమెన్ సేఫ్టీ సెల్

- ఎస్పీ కార్యాలయంలో ప్రారంభించిన కలెక్టర్ విజయ కృష్ణన్



ఉమెన్ సేఫ్టీ సెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపికా పాటిల్

సాక్షి, అనకాపల్లి: మహిళల భద్రత కోసం ప్రత్యేక ఉమెన్ సేఫ్టీ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ దీపికా పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె సేఫ్టీ సెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలపై జరిగే నేరాలకు సంబంధించి ప్రచార పోస్టర్లను ఎస్పీ, సెయింట్ గోబిన్ సంస్థ ప్రతినిధులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే కార్యాలయాలు, ప్రదేశాలు, గ్రామాల్లో మహిళా పోలీసులతో మహిళా చట్టాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎస్పీ దీపికా పాటిల్ మాట్లాడుతూ.. స్కూళ్లు, కాలేజీలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో పోక్సో యాక్ట్, గృహహింస, సైబర్ క్రైమ్స్ తదితర చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించి ధైర్యం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన సెయింట్ గోబిన్ సంస్థ అచ్యుతాపురం ప్లాంట్ హెడ్ సర్వన్ కుమార్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నావికాదళ పనులకు రక్షణేది?



- ఎక్కడికక్కడ ఐఎన్ఎస్ వర్ష పనుల నిలిపివేత
- కాంట్రాక్టర్లను వేధిస్తున్న కూటమి నేతలు
- మొన్నటివరకు ఉప్పు–నిప్పుగా వ్యవహరించిన ఆ ఇద్దరు..
- వసూళ్ల వ్యవహారంలో తాజాగా స్నేహహస్తం
- కంపెనీలకూ తప్పని కూటమి నేతల ఒత్తిళ్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

శత్రుదేశ దాడుల నుంచి కాపాడుకునేందుకు అత్యంత దుర్భేద్యంగా నిర్మిస్తున్న నావికాదళ స్థావర పనులకే రక్షణ లేకుండా పోతోంది. ఏకంగా శత్రుమూకలు అణుదాడులు చేసినా చెక్కుచెదరకుండా రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న ఐఎన్ఎస్ వర్ష పనులు కాస్తా కూటమి నేతల బెదిరింపులతో నిలిచిపోయే పరిస్థితులు తలెత్తాయి. ఈ పనులు చేపడుతున్న కంపెనీలు సముద్రగర్భంలో కొన్ని పదుల కిలోమీటర్ల మేర దారిని నిర్మిస్తున్నాయి. ఇందుకోసం కంపెనీలు సమీపంలో మైనింగ్ చేస్తున్న వారి నుంచి భారీ బండరాళ్లను తరలిస్తున్నాయి. ఇక్కడ కాంట్రాక్టు చేపట్టిన సంస్థలకు ట్రిప్పుకు ఇంత ఇవ్వాలంటూ మొదట్లో కూటమి నేతలు బెదిరించారు. ఇందుకు సరేనంటూ ట్రిప్పుకు కొంత మొత్తం ఆ కాంట్రాక్ట్ సంస్థలు చెల్లించాయి.

ఇప్పుడు ఏకంగా పనుల్లోనే తమకు భాగస్వామ్యం ఇవ్వాలంటూ నిన్న మొన్నటి వరకు ఉప్పు–నిప్పుగా ఉన్న ఇద్దరు కూటమి నేతలు, ఓ ఎంపీ, ఎమ్మెల్యే ఇప్పుడు చేతులు కలిపి ఆయా సంస్థలపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. లేని పక్షంలో పనులు సకాలంలో జరగకుండా ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టిస్తామని బెదిరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వీరి ఒత్తిళ్లకు కొన్ని కంపెనీలు ఇప్పటికే తలొగ్గగా.. మరి కొన్ని కంపెనీలు అడిగినంత మేర భాగస్వామ్యం ఇస్తే తమకు గిట్టుబాటు కాదని వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా ఆయా కంపెనీలు పనులు చేయకుండా నేతలు అడ్డుకున్నారు. మొత్తంగా అటు కంపెనీలను, ఇటు కాంట్రాక్టర్లను.. కూటమి నేతల ఒత్తిళ్లు బాగా కుంగదీస్తున్నాయి.

బాధితులకు కోటిచ్చారు.. మాకేది?

అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్, పరవాడ ఫార్మాసిటీలోని రెండు కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 20 మంది కార్మికులు మరణించారు. వీరికి ఒక్కొక్కరికి చెరో కోటి చొప్పున ఆ కంపెనీలు నష్టపరిహారం ఇచ్చాయి. గాయపడిన వారికి కూడా నష్టపరిహారాన్ని అందజేశాయి. వీరి వైద్యానికి కానీ, నష్టపరిహారానికి కానీ ప్రభుత్వం నయా పైసా ఖర్చు చేయలేదు. నష్ట పరిహారం అందజేయడంలో మాత్రం ముందుంది. ఇక్కడితో ముగిసిందనుకున్న కంపెనీ యాజమాన్యాలకు కొత్త తలనొప్పులు వచ్చినట్టు తెలుస్తోంది. చనిపోయిన వారికి కోటి ఇచ్చారు సరే.... మరి మాకేటి? అంటూ కంపెనీలపై కూటమి నేతలు ఒత్తిళ్లు తెస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే భారీ నష్టపరిహారం అందజేయడంతో పాటు చికిత్స ఖర్చులతో ఇబ్బందిగా మారిందని.. దీనికి తోడు మీకూ ఇవ్వాలంటే తమకు కష్టమంటూ వాపోయినట్టు తెలిసింది. అయితే తమను ప్రసన్నం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవంటూ హెచ్చరించినట్టు సమాచారం.

ఐఎన్ఎస్ వర్ష విశేషాలివీ..

- ఐఎన్ఎస్ వర్ష పేరుతో రాంబిల్లి వద్ద 670 హెక్టార్లల్లో సాగరతీర అంతర్భాగంలో రహస్య స్థావరాలను నిర్మిస్తున్నారు. ఒకేసారి 12 సబ్‌మెరైన్లను ఇక్కడ రహస్యంగా ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- ప్రస్తుతం ఈఎన్‌సీ ప్రధాన కేంద్రంలోనే నేవల్ షిప్స్, సబ్‌మెరైన్‌లను ఉంచుతున్నారు. విశాఖపట్నం పోర్టు కూడా సమీపంలో ఉండటంతో కార్గో, కంటైనర్ షిప్స్‌తో నిరంతరం రద్దీగా ఉంటోంది. భద్రత దృష్ట్యా మరో రహస్య స్థావరం కోసం వర్షను నిర్మిస్తున్నారు.
- ఐఎన్ఎస్ అరిహంత్ వంటి న్యూక్లియర్ సబ్‌మెరైన్లు నెలల తరబడి సముద్ర గర్భంలో విధి నిర్వహణలో ఉంటాయి. 200 మీటర్ల లోతులో కదులుతున్నప్పుడు గుర్తించడం, ట్రాక్ చేయడం దాదాపు అసాధ్యం. అయితే ఇవి పోర్టు సమీపంలో లంగరు వేసినప్పుడు శత్రు గూఢచారి శాటిలైట్స్ సులభంగా గుర్తించగలవు. ఈ కారణంగానే వీటి సమాచారాన్ని గోప్యంగా ఉంచేలా భూగర్భంలోనే ఉంచేందుకు ఐఎన్ఎస్ వర్ష ఉపయోగపడుతుంది.
- ఐఎన్ఎస్ వర్షలో ఐదు టన్నెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సొరంగాల ద్వారా సబ్‌మెరైన్లు స్థావరంలోకి రాకపోకలు సాగిస్తుంటాయి.
- జలాంతర్గాములు ఉపరితలంపైకి రావాల్సిన అవసరం లేదు. అందువల్ల శత్రువులు వీటి జాడను కనిపెట్టలేరు.
- వర్ష బేస్‌లో సిబ్బంది విశ్రాంతి సౌకర్యాలు, మరమ్మతులు, నిర్వహణకు అనువుగా భవనాలు నిర్మిస్తున్నారు.



అండర్ గ్రౌండ్ బేస్ నమూనా

- మొత్తం 12 న్యూక్లియర్ సబ్‌మెరైన్‌లు ఒకే కాలంలో సముద్ర గర్భంలో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. డీజిల్, ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడి నుంచే ఆపరేట్ చేయగల సామర్థ్యం ఐఎన్ఎస్ వర్ష సొంతం.
- శత్రుమూకలు అణు దాడులు చేసినా.. వాటి నుంచి సురక్షితంగా ఉండేలా ఐఎన్ఎస్ వర్ష నిర్మాణం జరుగుతోంది.
- సబ్‌మెరైన్లలో అణు రియాక్టర్ల నిర్మాణం, అమర్చడం కూడా ఇందులోనే చేసుకునే వీలుంటుంది. నీటి అడుగున స్థావరం వద్ద మిస్సైల్ టెక్నికల్ పొజిషన్స్ అనే ఆయుధ నిల్వ సౌకర్యం కూడా ఉంటుంది.
- ఇక్కడ అరిహంత్ క్లాస్ సబ్‌మెరైన్లతో పాటు ఎస్–5, న్యూక్లియర్ ఎటాక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడ నిర్వహించేందుకు అనువుగా నిర్మిస్తున్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

అనకాపల్లి: వినాయక నవరాత్రుల సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆయా ప్రాంతాల ఎస్‌హెచ్‌వో పరిధిలో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ ఎం.దీపిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు, రికార్డింగు డాన్సులు నిర్వహించరాదన్నారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, మైకులు, సౌండు బాక్సులతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయకూడదని, అందుకు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. నిమజ్జనం సమయాల్లో రంగులు జల్లు కోవడం, బాణసంచా కాల్చడం నిషిద్ధమని తెలిపారు.

ఈనెల 20 కల్లా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

- గృహ నిర్మాణ సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల : జిల్లాలో నిర్దేశించిన గృహ నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 6,276 (రూఫ్ లెవెల్, రూఫ్ కంప్లీటెడ్) గృహ నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈనెల 20 నాటికి శత శాతం పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. లక్ష్యసాధనలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో చీడికాడ, అనకాపల్లి రూరల్, కోటవురట్ల, గొలుగొండ, అచ్యుతాపురం, మండలాల ఏఈలు లక్ష్యసాధనలో మరింత మెరుగైన పనితీరును కనబరచాలన్నారు.

నరకం చూసిన దివ్యాంగులు

- ప్రణాళిక లోపంతో సదరం క్యాంపులో గందరగోళం
- 2 వేల మంది దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు అవస్థలు
- వారి రాకతో కిక్కిరిసిన ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి
- క్యాంప్ నిలిపేసి వెనక్కి పంపేసిన వైద్యాధికారులు
- మండలాల వారీగా తాజా షెడ్యూల్ ప్రకటన



సదరం సర్టిఫికెట్లకోసం కిక్కిరిసిన దివ్యాంగులు



ఆస్పత్రి బయట వేచియున్న దివ్యాంగులు

సాక్షి, అనకాపల్లి: అధికారుల నిర్లక్ష్య వైఖరితో దివ్యాంగులు అష్టకష్టాలు పడ్డారు. అసలే వైకల్యంతో బాధ పడుతున్నవారు శారీరకంగా, మానసికంగా మరింత కుంగిపోయారు. మంచానికే పరిమితమైన అభాగ్యులు కూడా అందులో ఉన్నారు. బుధవారం నుంచి సదరం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్టు ప్రకటించడంతో ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రికి దాదాపు రెండు వేలమంది చేరుకున్నారు. తగిన ప్రణాళిక లోపించడంతో వారికి కష్టాలు ఎదురయ్యాయి. సచివాలయ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల వాట్సాప్ గ్రూపుల్లో 80 శాతం పైబడిన దివ్యాంగులతోపాటు 9 రకాల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సదరం సర్టిఫికెట్లు ఇస్తామని మంగళవారం మెసేజ్‌లు పెట్టారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి దివ్యాంగులు తరలి రావడంతో ఆస్పత్రి కిక్కిరిసిపోయింది. ఇబ్బందులు తలెత్తడంతో డీసీహెచ్ఎస్, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నతాధికారులకు తెలియజేసి క్యాంపును వెంటనే నిలుపుదల చేశారు. **మండలాలవారీగా ఎప్పుడు** నిర్వహిస్తారో పత్రికల్లో **ప్రకటిస్తామని చెప్పి పంపించేశారు.** దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు తీవ్ర వేదనకు గురయ్యారు.

మండలాల వారీగా సదరం క్యాంపు వివరాలు ఇలా..

- 5వ తేదీ గురువారం– రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాలు
- 6వ తేదీ శుక్రవారం– పరవాడ, అనకాపల్లి టౌన్, రూరల్ మండలం, చోడవరం
- 9వ తేదీ సోమవారం– సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలు
- 10వ తేదీ మంగళవారం– చీడికాడ, మాడుగుల, బుచ్చియ్యపేట మండలాలు
- 11వ తేదీ బుధవారం– కశింకోట, యలమంచిలి, ఎస్.రాయవరం
- 12వ తేదీ గురువారం– రావికమతం, రోలుగుంట, మాకవర పుపాలెం
- 13వ తేదీ శుక్రవారం– నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం
- 17వ తేదీ **మంగళవారం– కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలు**

అసౌకర్యానికి చింతిస్తున్నాను : డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు

సదరం క్యాంపునకు జిల్లాలో అన్ని మండలాల నుంచి ఒకే రోజు తరలిరావడంతో పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు కొద్దిగా ఇబ్బంది కలిగిన మాట వాస్తవమే. ఇలాంటి కష్టం మళ్లీ ఎదురుకాకుండా జిల్లాలోని 24 మండలాలకు రోస్టర్ తయారు చేశాం. దాని ప్రకారం సదరం క్యాంప్ నిర్వహిస్తాం. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఆస్పత్రికి ఎవరూ రావద్దు. 9 రకాల వ్యాధిగ్రస్తులకు సదరం సర్టిఫికెట్లు ఇస్తాం.

కనీస కనికరం లేదు



నా కుమార్తె పూజితకు పుట్టిననాటి నుంచి మాటలు లేవు. కూర్చోలేదు, నిల్చోలేదు. 100 శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ ఉంది. 80 శాతం పైబడిన దివ్యాంగులకు కొత్తగా రూ.15 వేల ప్రభుత్వ పింఛన్ అందజేస్తారని చెప్పడంతో సబ్బవరం నుంచి అనకాపల్లికి వెయ్యి రూపాయలు ఇచ్చి ఆటో కట్టించుకొని వచ్చాను. ఇక్కడకు వచ్చాక సదరం క్యాంపు వాయిదా వేసినట్టు చెప్పారు. **ప్రభుత్వ అధికారులు దివ్యాంగులతో ఆటలాడడం అన్యాయం.**

–లక్ష్మి, సబ్బవరం

మిస్టర్ టీన్ ఇండియా మనోడే

- ఫైనల్ విజేతగా ఏటికొప్పాక కుర్రాడు



ఆదిత్యనాయుడ్ని అభినందిస్తున్న ఏటికొప్పాక గ్రామస్తులు

యలమంచిలి రూరల్: మిస్టర్ టీన్ ఇండియా 2024 ఫైనల్ పోటీల్లో మన కుర్రాడే విజేతగా నిలిచి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాడు. కఠోర సాధన, తపస్సుతో అసాధ్యమనుకున్న ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన జెడ్పీటీసీ సభ్యురాలు శానాపతి సంధ్యారాణి, రాముల చిన్న కుమారుడు ఆదిత్యనాయుడు (16). చిన్నతనం నుంచి మోడలింగ్‌లో ఆసక్తి ఉండటంతో సంకల్పసిద్ధి, లక్ష్య సిద్ధితో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఇటీవల డిల్లీ వేదికగా జరిగిన అలీ క్లబ్ మిస్టర్ టీన్ ఇండియా 2024 ఫైనల్ పోటీల్లో 167 నగరాలకు చెందిన 271 మంది పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 50 మందిని ఫైనల్స్‌కు ఎంపిక చేయగా, అందులో ఆదిత్యనాయుడు కూడా ఉన్నాడు. బుధవారం గ్రామానికి చేరుకున్న ఆదిత్యనాయుడికి గ్రామ పెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు అభినందించారు. గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

తుమ్మపాల: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ప్రకటించారు. వీరికి ఎస్ఆర్ శంకర సమావేశ మందిరంలో గురువారం జరిగే గురుపూజోత్సవంలో అవార్డులు ప్రదానం చేస్తారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి అనిత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయులు : కె.శ్రీరామమూర్తి (పులపర్తి, యలమంచిలి), ఎం.జె.రవీంద్రబాబు (తురకలపూడి, బుచ్చెయ్యపేట), అళ్ల సుధాకర్ (పెదగుమ్మలూరు, ఎస్.రాయవరం)

స్కూల్ అసిస్టెంట్లు: సిహెచ్.వి.వి.సత్యనారాయణ **(పెదబోడిగల్లం), వై.శ్రీనివాసరావు (తాళ్లపాలెం), కె.వీరునాయుడు (ఉప్పరాపల్లి),పి.రమాకాంత్ బాల్జి (అనకాపల్లి),** ఎస్.**ప్రభాకర్ (జన్నవరం), ఎ.శ్రీనివాసరావు (అప్పలరాజపురం), కె.సంపతరావు (ఉప్పరాపల్లి), భాస్కర శారద (రేవుపోలవరం),** బి.పద్మజా రవిబాబు (గుంటపల్లి), కె.కె.ఎల్.ఎస్.ధర్మారావు (గుర్రాజుపేట), ఎం.భానుశ్రీ (పెదగుమ్మలూరు), సిహెచ్.విమలాదేవి (డీహెచ్ అగ్రహారం), జె.రాణిఫ్లారెన్స్ (యలమంచిలి), పి.వరలక్ష్మి (కొత్తపేట), జె.అమృతరావు (ఎ.కోడూరు), వై.శ్రీనివాసరావు (గుంటపల్లి), డి.పినాకపాణి (వంగలి)

ఎస్జీటీలు : రొబ్బి లక్ష్మి (మునగపాక), వి.శ్రీదేవి (ఎడతం, పాయకరావుపేట), పిల్లా వెంకట ఆనంద్ (వి.మాడుగుల), మళ్ల శ్రీనివాస్ (యలమంచిలి), రావాడ త్రినాథరావు (ఆర్లె, కె.కోటపాడు), రావాడ సునీత (వీఎస్ పేట, నర్సీపట్నం), టెకి రాజ్‌కిరణ్ (కశింకోట), ఎస్.వీరాంజనేయులు (పీవీ పాలెం, కె.కోటపాడు), బీవీపీ మహేశ్వరి (మంచాల, చీడికాడ), కె.రవికుమార్ (రోలుగుంట), బి.సూర్యనారాయణ (వెలంకాయలపాలెం, రోలుగుంట), జి.రాజశేఖర్ (చినగొల్లపాలెం, యలమంచిలి), ఎ.వి.రామచంద్రరావు (అనకాపల్లి), ఎ.రమణమూర్తి (లింగంపేట, గొలుగొండ), ఎ.అప్పాజీరావు (కొక్కిరాపల్లి యలమంచిలి), కె.నూకేశ్వరరావు (అనకాపల్లి), వై.నరసింహమూర్తి (వైబీ పట్నం, రోలుగుంట), ఎస్.టి.పి.విద్యావతి (రావికమతం)



మా మంచి మాస్టారు..

తల్లిదండ్రుల తరువాత...అంతటి గౌరవ స్థానం కల్పిస్తూ ఆచార్య దేవోభవ అంటూ గురువును దైవంతో సమానంగా పూజించే సమాజం మనది. గురువులు విద్యార్థులతో పాటు సమాజానికీ మార్గదర్శకంగా ఉంటారు. ఉపాధ్యాయ వృత్తిని ఒక బాధ్యతగా స్వీకరించి భావి పౌరులను సన్మార్గంలో పెట్టే గురుతర బాధ్యత గురువులది. చిన్నారులను క్రమశిక్షణలో పెట్టడంలో గురువుల కృషి ఎనలేనిది. సామాజిక సేవలోనూ తమదైన ముద్ర వేసుకుని మా మంచి మాస్టారు అంటూ అందరి మన్ననలు పొందుతున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా... ఎందరో గురువులు...అందరికీ వందనాలు.

మాడుగుల రూరల్: తాను చిన్ననాడు చదువుకున్న బడిలోనే ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ.. పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. చదువుల తల్లి రుణం తీర్చుకుంటున్నారు సిరిపిల్లి నాగ వెంకట దేవి సూర్యనారాయణ. ఆయన మాడుగుల నడిబొడ్డున 114 సంవత్సరాల చరిత్ర కలిగిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (గెడ్డబడి) హెచ్‌ఎంగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. సూర్యనారాయణ ఈ పాఠశాలలోనే 1976 నుంచి 1982 వరకు చదువుకున్నారు. 1998లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టిన సూర్యనారాయణ 2021 జనవరి నుంచి మాడుగుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

అభివృద్ధి బాటలో పాఠశాల

సూర్యనారాయణ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించే నాటికి ఈ బడిలో కేవలం 34 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యను 144కు పెంచారు. ఈ బడిని స్థానిక వాసవీక్లబ్ దత్తత తీసుకుంది. దీంతో పాటు ఆరోహణ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ, మన్యం జ్యోతి సేవా సంఘం, భారత నిర్మాణ సేవా ట్రస్టు వంటి సంస్థలు, సంఘాల సహకారంతో పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నారు. 2019లో చింతలూరులో ఉపాధ్యాయునిగా పనిచేసేటప్పుడు ఆయనకు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఇటీవల గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక షిరిడీ సాయి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



పాఠం చెబుతున్న హెచ్‌ఎం సూర్యనారాయణ

బోధన..గురుతర బాధ్యతగా...



ఎస్.వి.ఎస్ ఆచార్యులు

నక్కపల్లి : విద్యాబోధన అంటే కేవలం వృత్తి ధర్మంగా మాత్రమే కాకుండా ఒక సామాజిక బాధ్యతగా భావించి విద్యార్థుల ఉన్నతికి శ్రమించే ఉపాధ్యాయులెందరో. ఆ కోవకే చెందుతారు పెదబోదిగల్లంకు చెందిన తెలుగుపండిట్ ఎస్.వి.ఎస్. ఆచార్యులు మాస్టారు. పాఠశాలలో విద్యా బోధనతో పాటు, వెనుకబడిన విద్యార్థుల కోసం సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. సొంత ఖర్చుతో అల్పాహారాన్ని సమకూరుస్తుంటారు. పదోతరగతి విద్యార్థుల కోసం రాత్రి సమయాల్లో వారి ఇళ్లకు వెళ్లి ఎలా ప్రిపేర్ అవ్వాలో నేర్పిస్తారు. పిల్లలకు ఏవిధమైన పోషకాహారాన్ని ఇవ్వాలో వారి తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు ఇస్తుంటారు. గ్రామాల్లో రామాలయాలు, కమ్యూనిటీ భవనాల వద్ద పదోతరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి సందేహాలు నివృత్తి చేస్తుంటారు. పాఠశాల పునఃప్రారంభ సమయంలో గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు ఎంతో కృషి చేస్తారు. వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలకు హాజరై పిల్లలకు పుస్తక పఠనం, పద్య పఠనంపై ఆసక్తి కలిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తుంటారు. గత ఏడాది ఆచార్యులు మాస్టారిని ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఘనంగా సత్కరించింది.

క్రమశిక్షణకు మారుపేరులా... నిన్న మాస్టారు.. నేడు ఐపీఎస్..



కిల్లాడ సత్యనారాయణ

నక్కపల్లి : కోటవురట్ల మండలం పాములవాక గ్రామానికి చెందిన కిల్లాడ సత్యనారాయణ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అయి ఐపిఎస్ అధికారిగా ఎంపికయ్యారు. 1996లో నక్కపల్లి మండలం దేవవరం ప్రాథమిక పాఠశాలలో సెకెండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న సమయంలో సివిల్స్ సర్వీసు పరీక్షలు రాశారు. ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రాలో ఏఎస్పీగా నియమితులయ్యారు. అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం ఆయన ఉత్తరప్రదేశ్‌లో ఇన్‌స్పెక్టర్ జనరల్ ర్యాంక్ (రాష్ట్ర స్థాయి అధికారిగా) లక్నోలో పోలీస్ శాఖలో సేవలందిస్తున్నారు. సత్యనారాయణది సాధారణ నిరుపేద కుటుంబం. ఒక పక్క విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆయన రాయలసీమ ప్రాంత ఐజీగా, ఏపీ ఫైర్ సర్వీసెస్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా ఐదేళ్లపాటు డిప్యూటేషన్‌పై సేవలందించారు. ఎంతో మంది సివిల్స్ అభ్యర్థులకు సలహాలు, సూచనలు అందించడంతో పాటు అవగాహన తరగతులు నిర్వహించడం, స్టడీ మెటీరియల్ అందజేసి ఎంతోమందికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఆయనకు శుభాభినందనలు.

అనకాపల్లి రూరల్ సీఐగా అశోక్‌కుమార్



అనకాపల్లి: అనకాపల్లి రూరల్ సర్కిల్ సీఐగా జి.అశోక్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అల్లూరు సీతారామరాజు జిల్లా జీకే వీధి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా రూరల్ స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ధనుంజయ యలమంచిలి సర్కిల్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఎక్కడైన అసాంఘిక కార్యక్రమాలు జరిగినట్టయితే ఆయా ప్రాంతాల ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 149 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,080	4,940
రెండో రకం	3,410	3,470
మూడోరకం	3,200	3,400

అనకాపల్లి సినిమాలు

గబ్బర్ సింగ్ : రాజా
తంగలాన్ : సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు : సత్యనారాయణ స్క్రీన్-2
సింబా : పర్తిసాయి
శ్రీలక్ష్మీనరసింహ(జ్యోతి)జామి : షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
మారుతీనగర్ సుబ్రమణ్యం : శ్రీసత్య
11 డిమోంటి కాలని : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-1 యూనిట్, బి పాజిటివ్-7 యూనిట్లు, ఒ పాజిటివ్-11 యూనిట్లు, శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ను సంప్రదించవచ్చు.

అన్నదాతల ఆశలకు జీవం



బయ్యవరం వద్ద వరి నాట్లు వేస్తున్న కూలీలు



బయ్యవరంలో నాట్లు వేయడానికి సిద్ధం చేసిన పొలం

- మేలు చేసిన తుపాను వర్షాలు
- లక్ష్యానికి చేరువగా ఖరీఫ్ వరినాట్లు పడే అవకాశం

కశింకోట: అన్నదాతల ఆశలకు ఇటీవల కురిసిన తుపాను వర్షాలు జీవం పోశాయి. మండలంలో రైతులు ఖరీఫ్ వరినాట్లు ముమ్మరం చేశారు. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణానికి మించి వరి సాగవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, జమాదులపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు,ఎ.ఎస్.పేట, సోమవరం, నరసింగబిల్లి, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్యుతాపురం, అచ్చెర్ల, జి. భీమవరం, సుందరయ్యపేట, ఆనందపురం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం,కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తేగాడ,పేరంటాలపాలెం, జోగారావుపేట తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తారు. శారదానది నీరు, సాగునీటి చెరువులు, కొండ గెడ్డల నీటితో పాటు వర్షాధారంగా పండిస్తారు. వరి సాధారణ విస్తీర్ణం 909 హెక్టార్లు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు జూన్ నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా నారు దెబ్బతింది. దీంతో బోర్ల సదుపాయం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే జులై నెలాఖరులో నాట్లు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో మందకొడిగా వ్యవసాయ పనులు సాగాయి. ఆగస్టులో నెలలో 200 హెక్టార్లలో మాత్రమే నాట్లు పడ్డాయి. తర్వాత తుపాను కారణంగా వర్షాలు పడి నీటి సదుపాయం ఏర్పడడంతో ఒక్కసారిగా నాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికి దాదాపు 850 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయి. మిగిలిన ప్రాంతంలో ఈ నెల 15లోగా నాట్లు వేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. బయ్యవరం పెద్ద చెరువు నీరు ఆధారంగా సుమారు 500 ఎకరాల్లో వరి సాగు చేస్తారు. తగినంత నీరు లేకపోవడంతో చెరువు కింద పొలాల్లో నాట్లు ఆలస్యమవుతున్నాయి.

ముగింపు దశకు నాట్లు

మండలంలో ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 850 హెక్టార్లలో ఖరీఫ్ వరి నాట్లు వేశారు.తుపాను కారణంగా వర్షాలు కురవడం వల్ల నాట్లు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. వరి సాగు సాధారణ విస్తీర్ణం 909 హెక్టార్లు.ఈ నెల 15 వరకు వరి నాట్లు వేస్తారు. సాధారణ విస్తీర్ణాన్ని మించి ఈ ఏడాది నాట్లు పడగలవని ఆశిస్తున్నాం.

–ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

6న చోడవరంలో జాబ్ మేళా

తుమ్మపాల: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 6న చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు కె.శచిదేవి ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల పది, ఇంటర్, డిగ్రీలో ఉత్తీర్ణులైన యువతీయువకులు హాజరుకావచ్చన్నారు. నక్కపల్లి హెటిరో డ్రగ్స్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, కె.ఎల్. గ్రూప్‌లో ఖాళీగా పోస్టులభర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9494791935, 9912459533, 8309922923, 6302413301, 9491070295, 6303000080, 9492572737, 8500904876 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ

మునగపాక: ప్రతి బీఎల్‌వో ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరు జాబితాల్లో లోపాలను సవరించాలని, కుటుంబ సభ్యులంతా ఒక చోట ఉండేలా ఓటరు జాబితాలు తయారు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఎంపీడీవో మన్మధరావు,ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శారదా బ్రిడ్జిపై విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేపట్టాలి



పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కు వినతిప్రతం అందజేస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి: స్థానిక శారదానది కొత్త, పాత బ్రిడ్జిలపై విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేపట్టాలని బహుజన్ సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. ఈ మేరకు బుధవారం కొత్తూరు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పట్టణం నుంచి మండలంలో కొత్తూరు, సత్యనారాయణపురం, మూలపేట, బీఆర్టీ కాలనీతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలుసాగిస్తారని, లైట్లు వెలగకపోవడం వల్ల రాత్రి సమయంలో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

నేడు స్వర్ణ సంపెంగలతో అర్చన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధిలో శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో స్వామివారికి ఈనెల 5న స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూజ అనంతరం స్వామివారు వెండి కవచంతో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆడారి కుమారస్వామి



కొత్తూరులో వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతిని పూజించండి... ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల నుంచి పర్యావరణాన్ని పరిరక్షించండని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవం కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. ప్లాస్టర్‌ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను పూజించవద్దని కోరుతూ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డులో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మట్టి గణపతిని పూజించి, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ ఏడాది సుమారు 26 స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో వినాయక ఉత్సవ సామూహిక కమిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో 60 వేల మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొణతాల హర్‌నాథ్‌బాబు, పి.సోమశేఖర్, సకురు చంద్రం, మల్ల భోగ లింగం, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద స్పందించే హృదం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్న కొణతాల జనార్దన్

అనకాపల్లి: ప్రపంచ వ్యాప్తంగా హిందువులు అత్యంత ఘనంగా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని హిమశేఖర్ కళాశాలల అధినేత కొణతాల జనార్దన్ అన్నారు. స్థానిక గవరపాలెం కళాశాల ఆవరణలో రెండు వేల మట్టిగణపతులను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టిగణపతులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ భాస్కరరావు, పి.సురేష్, అధ్యాపకులు పూర్ణ, నాగశివ, సూర్య, కిరణ్, ఉమామహేష్ పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలందించాలి



తగరంపూడి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి: రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని, వర్షాలు పడుతున్నందున వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలో తగరంపూడి పీహెచ్‌సీలో బుధవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పొలాల్లో వరినాట్లు వేస్తున్న సమయంలో రైతులు విష సర్పాల కాటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, ఆ ఇంజక్షన్లతో పాటు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి పావని, ఎంపీడీవో నరసింహారావు పాల్గొన్నారు.

ముగిసిన హరికథ కార్యక్రమం



రాణీ సువర్ణను సత్కరిస్తున్న కొణతాల లక్ష్మీనారాయణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో శ్రావణమాసం నెలరోజుల పాటు 'మహాభారరతం ఆఖరిఘట్టం'పై నిర్వహించిన హరికథ కార్యక్రమం మంగళవారం రాత్రి ముగిసింది. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ కళాకారిణి రాణి సువర్ణ నెల రోజుల పాటు చెప్పిన హరికథ ప్రజలను ఆకట్టుకుంది. హరికథ ముగింపు సందర్భంగా అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ(పెదబాబు) రాణి సువర్ణను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్లక్ష్యం వల్లే భారీ ఆస్తి, ప్రాణనష్టం

అనకాపల్లి: వరదల నుంచి ప్రజలను కాపడడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,చంద్రబాబు నిర్లక్ష్యంవల్లే భారీఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లాకార్యదర్శి జాజులరమేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాతావరణశాఖ అధికారులు అందించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేసి, వారిని విపత్తునుంచి కాపాడడంలో చంద్రబాబునాయుడు శ్రద్ధ చూపకపోవడమే ఈఅనర్థానికి కారణమన్నారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడంలో, వరదల్లో చిక్కుకుపోయిన వారికి ఆహారం, తాగునీరు,చిన్నారులకు పాలు సరఫరా చేయడంలోను పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు

యలమంచిలి రూరల్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని,జీవకోటికి ప్రాణవాయువు అందించే వాటిని కాపాడికోవడం మనందరి బాధ్యత అని కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం అన్నారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాల ఆవరణలో వివిధ పండ్ల మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటడం తో పాటు వాటిని సంరక్షించడం బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షుడు కృష్ణ, కె.దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్సార్ నిధులతో దోమ తెరలు

- తొలివిడతలో 10 వేలు అందజేసిన కార్పొరేట్ కంపెనీలు
- వరద ప్రభావిత ప్రాంతాలకు 2,500 కేటాయింపు
- రెండవ విడత రానున్న మరో 17వేలు
- ఫలించిన అనకాపల్లి, అల్లూరి కలెక్టర్ దంపతులు దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్ కృషి



చింతూరు ప్రాంతానికి తరలిస్తున్న దోమతెరల వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్ తదితరులు

సాక్షి,పాడేరు: జిల్లాలో దోమ తెరల సమస్య పరిష్కారానికి పాడేరు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్ దంపతులు ఏఎస్ దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్ చొరవ చూపారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని కార్పొరేట్ సంస్థలతో అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్, పాడేరు కలెక్టర్ దినేష్‌కుమార్ దంపతులు చర్చించి సీఎస్సార్ నిధులతో దోమతెరలను సమకూర్చారు. 11 కార్పొరేట్ సంస్థలు రూ.37.17 లక్షలతో 17 వేల దోమతెరలు కొనుగోలు చేశాయి. తోయోత్సు కంపెనీ మరో 10వేల దోమతెరల కొనుగోలుకు అంగీకారం తెలిపింది. హెటిరో ల్యాబ్స్ 2,500, వేసువ్లస్ 2,500, డెక్కన్ ఫైన్ కెమికల్స్ 2వేలు, పోరస్ లాబ్స్ 2వేలు, వసంత కెమికల్స్ వెయ్యి చొప్పున మొత్తం 10వేల దోమ తెరలు తొలివిడతగా బుధవారం పాడేరు చేరుకున్నాయి. మిగతా 17 వేలు రెండో విడతలో రానున్నాయి. మలేరియా పీడిత గ్రామాల్లోని ప్రజలకు వీటిని అత్యవసరంగా పంపిణీకి కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. వీటిలో 2,500 దోమ తెరలను చింతూరు డివిజన్ పరిధిలోని వీఆర్‌పురం మండలంలో గోదావరి వరద ప్రభావిత బాధితులకు పంపిణీ చేయాలని కలెక్టర్ నిర్ణయించారు. ఈ మేరకు చింతూరు ప్రాంతానికి బయలుదేరిన వాహనాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్,జేసీ అభిషేక్‌గౌడ్ బుధవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. వెంటనే పంపిణీకి చర్యలు తీసుకోవాలని అక్కడి ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఎంవో తులసి, వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీబీ, ఎయిడ్స్‌పై అప్రమత్తం

అనకాపల్లి: టీబీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ వైద్యాలయం ఆస్పత్రి వైద్య బృందం సూచించింది. స్థానిక ఎన్టీఆర్ బెల్లంమార్కెట్ ఆవరణలో అనకాపల్లి గాంధీ మార్కెట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి కౌన్సెలర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఛాతినొప్పి, కఫంలో రక్తం పడడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యుల సూచనలు మేరకు మందులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పొలిమేర శివ అప్పారావు, కార్యదర్శి బుద్ధ రాము, కోశాధికారి పొలిమేర వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం తోటంకి గ్రామానికి చెంది పి.రాంబాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్రవాహనం మీద వెళుతున్న రాంబాబును వెనుకనుంచి లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని స్థానికులు ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. బాధితుడు రాంబాబు ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కశింకోటలో భారీ వర్షం

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ఖరీఫ్ వరి నాట్లకు, నారుమళ్లకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

రూ.2 లక్షల విరాళం

కశింకోట: మండలంలోని బయ్యవరంలో గల సాగర్ సిమెంట్ పరిశ్రమ తరఫున విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల విరాళాన్ని జిల్లా యంత్రాంగానికి అందించినట్టు పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో రూ.లక్ష డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అకౌంట్‌కు, మరో లక్ష విలువ కలిగిన పాల ప్యాకెట్లను పంపిణీ చేయడానికి తహసీల్దార్ ద్వారా అందజేశామన్నారు.

వరద బాధితుల కోసం వస్త్రాల సేకరణ



గవరపాలెం పార్క్ సెంటర్ వద్ద వస్త్రాలు సేకరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు వివిధ రూపాల్లో విరాళాలు సేకరిస్తున్నట్టు రోటరీ క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్ తెలిపారు. స్థానిక గవరపాలెం పార్కుసెంటర్ వద్ద క్లబ్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి కొత్త, పాత వస్త్రాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా వస్త్రాలు ఇచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బుద్ధ రమణాజీ, కె.సతీష్, కె.ఎల్.ఎం.కుమార్, పి.చందు, మళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.